# పంట భూముల్లో సెజ్!

- ఆందోళనలో రైతులు
- స్టీల్‌ప్లాంట్ భూములకూ ఎసరు!

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

'పండించిందే తింటున్నాం. భూమిపోతే ఎక్కడకు పోతాం. ఎలా బతుకుతాం. ఏమి తింటాం' అని కె.కోటపాడు మండలంలోని నూతన సెజ్ ప్రతిపాదిత గ్రామాల రైతులు వాపోతున్నారు. తరతరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న పేద, చిన్న రైతు కుటుంబాల్లో అక్కడ సెజ్ ప్రతిపాదన తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల నియోజకవర్గ పరిధిలోని కె.కోటపాడు మండలం ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి, కింతాడ, గొండిపాలెంలో 1392 ఎకరాల్లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొద్ది రోజుల క్రితం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ విజయకృష్ణన్ ప్రతిపాదిత సెజ్ భూముల పరిశీలనకు వెళ్లినప్పుడు రైతులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తమ భూములను ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. సెజ్‌కు భూములు ఇచ్చేందుకు రైతులను ఒప్పించే పని అధికార పార్టీ నాయకులకు ప్రభుత్వం అప్పగించింది. రైతులు వ్యతిరేకించకుండా ఉండేందుకు ప్రస్తుతం డి-పట్టా భూములు 1,392 ఎకరాల్లో సెజ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత జిరాయితీ భూములనూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించనున్నట్లు సమాచారం. ఆర్లి రెవెన్యూలో 132 ఎకరాలు, గుల్లేపల్లిలో 33 ఎకరాలు, కింతాడలో 203 ఎకరాలు, గొండిపాలెంలో 53 ఎకరాలు, గరుగుబిల్లిలో 137 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు అనేక సంవత్సరాల క్రితం 404 మంది పేదలకు ఇచ్చిన 834 ఎకరాల భూమినీ సెజ్‌కు తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆర్లి రెవెన్యూలోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 700 ఎకరాల్లో 300 ఎకరాలను కూడా సెజ్‌కు తీసుకొని, ఆ భూమికి బదులు వేరేచోట భూమి ఇచ్చేలా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపి ఒప్పించాలని భావిస్తున్నారు. సెజ్‌కు ప్రతిపాదించిన భూముల్లో రైతులు మామిడి, జీడి తోటలు సాగు చేస్తున్నారు. ఆర్లి పంచాయతీ చింతపాలెంలో ఎకరా నుంచి ఐదెకరాల భూమి కలిగిన చిన్న రైతులు ఉన్నారు. వరి, చెరుకు, వేరుశనగ, మామిడి, జీడి తోటలను వర్షాధారంగా సాగుచేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నారు. నాలుగు వైపులా కొండల మధ్య పచ్చని పొలాలు, తోటలు, స్వచ్ఛమైన గాలి, పశు సంపదతో జీవనం సాగిస్తున్న చింతపాలెం ప్రజలు తమ భూములుపోతే ఎలా బతుకుతామని ప్రశ్నిస్తున్నారు. సెజ్ ప్రతిపాదిత గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా పరిశీలించడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు మాత్రం సెజ్‌కు భూముల ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉందని చెబుతున్నారు.


సెజ్ ప్రతిపాదిత చింతపాలెం భూములు

### భూములుపోతే ఎలా బతుకుతాం



రెండెకరాల సొంతభూమి ఉంది. చెరుకు, వరి, వేరుశనగ, మిరప పండిస్తున్నాం. ఒక పంట తరువాత ఇంకొక పంట వేసుకొని బతుకుతున్నాం. పెట్టుబడులుపోనూ ఏడాదికి రూ.50 వేల ఆదాయం వస్తోంది. పంట భూములు ఇచ్చేసి మేమెక్కడకు పోవాలి. ఎలా బతకాలి..

-వంటాకు వెంకునాయుడు, చింతపాలెం, కోటపాడు మండలం

### భూమి వదులుకోం



ఐదెకరాల సొంత పల్లపు భూమిలో మామిడి తోట, చెరుకు, వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నాను. ఎంతోకాలం నుంచి అ భూములనే నమ్ముకొని బతుకుతున్నాం. ఈ భూమి లేకపోతే మేమయిపోవాలి ? భూమి వదులుకోం.

-కసిరెడ్డి గుమ్మయ్య, చింతపాలెం

### సేకరించిన ఖాళీ భూముల్లో పరిశ్రమలు పెట్టాలి



ఈ ప్రాంతంలో పేద, చిన్న రైతుల డి-పట్టా భూములు తీసుకోవాలనుకోవడం తగదు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి ప్రాంతాల్లో సేకరించిన భూముల్లో స్థలాలు ఇంకా ఖాళీగా ఉన్నాయి. వాటిలో పరిశ్రమలు ఏర్పాటు చేసి విద్యార్హతలు కలిగిన జిల్లాలోని యువతకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి. పంట భూములను తీసుకోవాలన్న ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.

-డి.వెంకన్న,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు


గురజాడ నివాసంలో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

## పాఠ్యాంశంగా గురజాడ జీవితం

- గురజాడ 162వ జయంత్యుత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహాకవి గురజాడ వెంకట అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ఆయన గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయాల్సి ఉందని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రతి పాఠశాలలో గురజాడ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నవయుగ వైతాళికులు గురజాడ 162వ జయంతోత్సవం విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ముందుగా కలెక్టరేట్‌లోని గురజాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను మంత్రి తిలకించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గురజాడ రచనలు ఇప్పటికే పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయని, ఆ మహనీయుని జీవిత చరిత్ర కూడా చేర్చడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. సామాజిక స్పృహతో రచనలు చేసిన గురజాడ పేరుతో స్ఫూర్తి అవార్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ.. మహాకవి గురజాడ చిరస్మరణీయులన్నారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ.. గురజాడ రచనలు నిత్య నూతనమని, అందరికీ ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు, కళాకారులను సత్కరించారు. అంతకుముందు గురజాడ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి జయంతి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, గురజాడ కుటుంబ సభ్యులు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేశలి అప్పారావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సాహితీ సంస్థల ప్రముఖులు, కళాకారులు కలిసి గురజాడ కూడలి వద్దకు ప్రదర్శనగా చేరుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## కూలీలపై కందిరీగల దాడి

- ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం/రూరల్ (శ్రీకాకుళం జిల్లా


రమణమ్మ, సూరి కిష్టప్పడు (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం లంకపేటలో విషాదం చోటు చేసుకుంది. కూలీలపై కందిరీగలు దాడి చేయడంతో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానిక కూలీల సమాచారం మేరకు.. లంకపేటకు చెందిన కూలీలు కిల్లారి రమణమ్మ (60), కిల్లారి సూరి కిష్టప్పడు (70), బోంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు మరి కొంతమంది కలిసి ఓ రైతు పొలంలో పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఒక్కసారిగా కందిరీగలు దాడి చేశాయి. గాయపడిన నలుగురిని తొలుత కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు, మెరుగైన వైద్యం కోసం ఆ తర్వాత జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిల్లారి రమణమ్మ, కిల్లారి సూరి కిష్టప్పడు మరణించారు. బొంతు కాంతమ్మ, ఇప్పిలి శ్రీరాములు చికిత్స పొందుతున్నారు. రమణమ్మకు భర్త, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు, సూరి కిష్టప్పడుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## వరదలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- తక్షణమే అఖిలపక్షం కమిటీ సమావేశం నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ

భారీ వరదలకు ప్రజలు నిండా మునిగి, సర్వం కోల్పోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల సిహెచ్ బాబూరావు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. బుడమేరు, కృష్ణా నది వరద ఉధృతికి విజయవాడ సగ భాగం మునిగిపోయిందని, ప్రజలు సర్వం కోల్పోయారని తెలిపారు. వరదను అంచనా వేయకపోవడం, ప్రమాద హెచ్చరికను ప్రజలకు తెలియచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల వైఫల్యమే కారణమని పేర్కొన్నారు. ఇటువంటి ఘోర విపత్తుపై చర్చించి, వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు అన్ని రాజకీయపక్షాలు, ప్రజాసంఘాల నేతలతో తక్షణమే సమావేశం నిర్వహించి, వారందరూ చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుని బాధితులకు పరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 6,880 కోట్ల మేర సహాయం కోరినా కేంద్ర ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. బుడమేరు వరదకు ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగిందని, వ్యాపారాలకు, పరిశ్రమలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నష్టంతో పోల్చితే ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ చాలా పరిమితమని అన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి అంతస్తు వారికి రూ.పది వేలు ప్యాకేజీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కనీసం రూ.50 వేలు ఇవ్వాలని, దెబ్బతిన్న ఆటోకు రూ.25 వేలు, ద్విచక్ర వాహనానికి రూ.పది వేలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న కార్లకు తగిన సాయంతోపాటు చిరు వ్యాపారస్తులకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని కోరారు. వరద బాధితులకు సిపిఎం అన్ని విధాలుగా అండగా నిలిచిందని, బాధితులను కాపాడటంలోనూ, వారికి భోజనాలు సరఫరా చేయడంలోనూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు ముందున్నారని తెలిపారు. విజయవాడ నగరంతో పాటు కొండపల్లి, ఇతర ప్రాంతాల్లో 12 కేంద్రాల ద్వారా 15 రోజుల పాటు లక్షా 59 వేల మందికి భోజనాలు వడ్డించారని, ఒక్క విజయవాడలోనే లక్షా 40 వేల మందికి భోజనాలు అందించినట్లు తెలిపారు. మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, అధికారుల మధ్య లోపించిన సమన్వయం కారణంగా క్షేత్ర స్థాయిలో వరద బాధితులను ఆదు కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

## గీత వృత్తిని నిర్వీర్యం చేయొద్దు

- ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడకుండా లక్షల మంది గీత కార్మికులకు జీవనాధారంగా ఉన్న కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలని ప్రభుత్వాన్ని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గీత కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గీత కుటుంబాలకు ఉపాధి పెంచే విధంగా నూతన కల్లు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. దహన సంస్కారాలకు రూ.30 వేలు, గాయపడిన వారి వైద్య ఖర్చులకు రూ.25 వేలు కార్పొరేషన్ ద్వారా ఇవ్వాలని, వృత్తిదారులకు ద్విచక్ర మోటార్ సైకిల్ ఇవ్వాలని కోరారు. తాటిచెట్టు ద్వారా 200 రకాల ఉత్పత్తులను తయారు చేయొచ్చని, తాటి బెల్లం, ఫామ్ డ్రింక్స్, సర్ఫ్ వంటి అనేక బై ప్రొడక్ట్స్ తయారు చేయొచ్చనే సైంటిస్టుల సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ నియామకాల ప్రక్రియ వెంటనే చేపట్టాలి

- కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరుద్యోగ యువత ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, హోంగార్డుల పోస్టుల రిజర్వేషన్ల కేసును తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులు, నిరుద్యోగులు, కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని జెడ్‌పి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని, దేహదారుఢ్య, మెయిన్ రాత పరీక్షలు నిర్వహించాలని పెద్ద ఎత్తున నినదించారు. ఈ ధర్నానుద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడారు. గత ప్రభుత్వం 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, ఈ మేరకు ప్రిలిమ్స్ రాత పరీక్షను కూడా నిర్వహించిందని తెలిపారు. క్వాలిఫై అయిన అభ్యర్థులకు నేటికీ దేహదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ రాత పరీక్షలు నిర్వహించలేదన్నారు. ఈ నోటిఫికేషన్‌లో హోంగార్డుల రిజర్వేషన్లను సివిల్ పోలీసుల కేటగిరీలో ఎనిమిది నుంచి 15 శాతం, ఎపిఎస్‌పి కేటగిరీలో 15 నుంచి 25 శాతానికి పెంచారని, దీంతో కొంత మంది కోర్టుకు వెళ్లగా హోం గార్డులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ఈ తీర్పుతో స్పెషల్ రిజర్వేషన్లకు కేటాయించిన పోస్టుల్లో మిగిలిన పోస్టులు జనరల్ అభ్యర్థులతో భర్తీ చేసే వీలు లేదన్నారు. హోంగార్డులకు రిజర్వేషన్లు పెంచడంతో జనరల్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా వాయిదాలకు హాజరు కాకుండా కేసును గాలికొదిలేసిందన్నారు. 'యువగళం' పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ పాండవులు దుర్గాప్రసాద్, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార ధరల్లో ఆకస్మిక పెరుగుదల ప్రమాదం

- ప్రపంచ దేశాల్లో మందగమనం
- ఆర్‌బిఐ బులిటెన్ వెల్లడి



**న్యూఢిల్లీ :** ఆహార ధరల్లో ఆకస్మిక పెరుగుదల ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఇండియా (ఆర్‌బిఐ) సెప్టెంబర్ బులిటెన్‌లో తెలిపింది. వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 4 శాతం దిగువన ఉన్నప్పటికీ.. ఆహార ధరల్లో అస్థిరత ఇబ్బందులను కలిగిస్తుందని పేర్కొంది. స్టేట్ ఆఫ్ ది ఎకానమీ శీర్షికతో ప్రచురించిన కథనం వివరాలు.. 'వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ వరుసగా రెండవ నెల ఆగస్టులోనూ 4 శాతం దిగువన చోటు చేసుకుంది. అయితే ఇటీవలి అనుభవాల దృష్ట్యా ఆహార ధరల అస్థిరత అనేది ఆకస్మిక ప్రమాదంగా మారింది." అని పేర్కొంది. ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖెల్ పాత్ర, ఇతర సెంట్రల్ బ్యాంక్ అధికారులు ఈ రిపోర్ట్‌ను రాశారు. ఆగస్ట్ ద్రవ్యోల్బణం 5బేసిస్ పాయింట్లు పెరిగినప్పటికీ ఇది స్వల్పమే.. దాదాపు ఇంతక్రితం నెల స్థాయిలోనే ఉందన్నారు.

ఈ ఏడాది ఆగస్టులో సిపిఐ 3.7 శాతంగా ఉంది. ఇంతక్రితం జులైలో 3.6 శాతంగా చోటు చేసుకుంది. సిపిఐని 4 శాతం దిగువన కట్టడి చేయాలని ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఆగస్టులో వినియోగదారుల ఇంధన ద్రవ్యోల్బణం సూచీలో 34 బేసిస్ పాయింట్లు, అహార, ఇంధనయేతర ద్రవ్యోల్బణంలో 27 బేసిస్ పాయింట్ల పెరుగుదల చోటు చేసుకుంది. కాగా అహార ద్రవ్యోల్బణం సూచీ 5.3 శాతానికి పెరిగింది. జులైలో 5.1 శాతంగా నమోదయ్యిందని ఆర్‌బిఐ కథనం పేర్కొంది.

**అధికారులకు సవాల్..**

ద్రవ్యోల్బణం తగ్గుతున్నప్పటికీ.. ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు మందగిస్తున్నాయని ఆర్‌బిఐ బులిటెన్ పేర్కొంది. ఇది ద్రవ్య విధాన అధికారులకు సవాల్‌గా నిలుస్తుంది. కాగా భారత్‌లో ప్రయివేటు వినియోగం, స్థూల స్థిర పెట్టుబడులు బలంగా ఉన్నాయి. 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో నికర ఎగుమతులు భారత జిడిపికి మద్దతునిచ్చాయి. కాగా.. ఆ త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి పరిమితమై ఐదు త్రైమాసికాల కనిష్టానికి పడిపోయింది. దీనికి వ్యవసాయం, ప్రభుత్వ వ్యయం, సేవలలో వృద్ధి మందగించడమే ప్రధాన కారణం.

"ఇప్పటికే గ్రామీణ డిమాండ్ పునరుద్ధరణతో ప్రధాన ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టింది. 2024 జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో గృహ వినియోగం పెరగడానికి సిద్ధంగా ఉంది. ఎఫ్ఎంసిజి రంగం డిమాండ్‌లోనూ పెరుగుదల చోటు చేసుకుంటుంది. పండుగ సీజన్‌కు ముందు ఇ-కామర్స్ సంస్థలు భారీగా చేపడుతున్న నియామకాలతో మెట్రో నగరాల్లోనే కాకుండా.. ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల్లోనూ వినియోగం పెరగనుంది." అని ఆర్‌బిఐ బులిటెన్ పేర్కొంది.




## శశికుమార్‌ను శిక్షించాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని స్వామి దయానంద సరస్వతి బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వార్డెన్ ఫణిశ్రీ, ఆమె భర్త శశికుమార్, కేర్‌టేకర్ లావణ్యలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నేతలు శనివారం ధర్నా నిర్వహించారు. ఆశ్రమం వసతి గృహంలోని బాలికలకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో సీట్లు కల్పించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. శశికుమార్ అకృత్యాలను ఎండగట్టారు. వసతి కల్పన పేరుతో పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. అక్రమంగా వసతి గృహం నడుస్తున్నా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియకపోవడం దారుణమన్నారు. ఆ వసతి గృహాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవా లని డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, బాధితులైన విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్లోనే వసతి కల్పించాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడుతూ విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## మూడవ బోటు వెలికితీత

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద అడ్డుపడిన మూడవ పడవను ఎట్టకేలకు అధికారులు శనివారం తొలగించారు. ఇనుప గడ్డర్లతో ఇప్పటికే రెండు పడవలను వెలికితీశారు. 40 టన్నుల బరువున్న ఈ మూడవ పడవ బ్యారేజీ 69వ గేటు వద్ద ఢీకొని అడ్డుగా మారింది. దీనిని పున్నమి ఘాట్ వద్దకు తరలించేందుకు ఇంజనీర్లు ఏర్పాట్లు చేశారు. మరోవైపు నాలుగో పడవ కూడా ఉన్నట్టు జలవనరుల శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ఒంగోలులో ఫ్లెక్సీల వివాదం

- తొలగించిన మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి వస్తారన్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు బాలినేని శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతూ ఒంగోలులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. 'జనసేన పార్టీలో చేరబోతున్న ప్రకాశం జిల్లా మెగాస్టార్ వాసన్నకు శుభాకాంక్షలు' అంటూ మెగా ఫ్యాన్స్ పేరు మీద కొంతమంది యువకులు చర్చి సెంటర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఫొటోతో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఫొటోలు కూడా వేశారు. జనార్ధన్ ఫొటో ఉండడంతో తెలుగు యువత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బందికి చెప్పి.. ఆ ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ.. బాలినేని శ్రీనివాసరెడ్డి గత ప్రభుత్వంలో తమను ఇబ్బందులకు గురిచేశారని, తమ మీద కేసులు పెట్టి, రౌడీషీట్లు తెరిపించారని, టిడిపి నాయకులను, కార్యకర్తలను హీనంగా చూసి, వేధింపులకు గురిచేశారని, తమ మీద దాడులు చేయించారని ఆరోపించారు. అలాంటి బాలినేని శ్రీనివాసరెడ్డిని జనసేనలో ఎలా చేర్చుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. బాలినేనిని జనసేనలోకి తీసుకుంటే ఒంగోలులో కూటమి నియమాలను పాటించాల్సిన అవసరం లేదన్నారు.

## భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్లకు చేరొచ్చు

- ఐడిబిఐ కాపిటల్ అంచనా

**న్యూఢిల్లీ** : భారత ఆర్థిక వ్యవస్థ 2032 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు చేరొచ్చని ఐడిబిఐ కాపిటల్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. దేశ జిడిపి ప్రతి 18 నెలలకు ఒక ట్రిలియన్ డాలర్లు జోడించే అవకాశం ఉందన్నారు. దీంతో ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్లకు చేరొచ్చని పేర్కొంది. మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాలు భారత్‌ను గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చనున్నాయని అంచనా వేసింది.

## అమెరికాలో ఓయో విస్తరణ

**న్యూఢిల్లీ :** ప్రముఖ హస్పిటాలిటీ సంస్థ ఓయో తన అమెరికా కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకోసం ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంచైజీ, మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్లను నడుపుతున్న జి6 హాస్పిటాలిటీ సంస్థను కొనుగోలు చేయనుంది. బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 525 మిలియన్ డాలర్ల (రూ.4300 కోట్లు)కు కొనుగోలు చేయనున్నట్లు ఓయో మాతృసంస్థ ఓర్వల్ స్టేస్ పేర్కొంది. 2019లో అమెరికాలో అడుగుపెట్టిన ఓయో ప్రస్తుతం 320కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ నుంచి మయూర క్రెడిట్ కార్డ్

**హైదరాబాద్ :** ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ప్రీమియం మెటల్ కార్డ్ పోర్ట్‌ఫోలియోకి జోడింపుగా మయూర క్రెడిట్ కార్డ్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కార్డు తరచుగా ప్రయాణించేవారికి, వ్యాపార ప్రయాణీకులకు, అడ్వెంచర్ కోరుకునే వారికి తోడుగా నిలుస్తుందని ఆ బ్యాంక్ పేర్కొంది. దీనిపై అనేక ఆకర్షణీయ రివార్డులను అందిస్తున్నట్లు తెలిపింది.

## ఎస్‌బిఐ సామాజిక సేవలు బలోపేతం

- అంధుల ఎన్‌జిఒకు మద్దతు
- పాల్గొన్న ఛైర్మన్ సిఎస్ శెట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్

దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన సామాజిక కార్యక్రమాలను మరింత బలోపేతం చేసింది. శనివారం హైదరాబాద్ పర్యటనలో ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి పలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంధుల ఎన్‌జిఒ దేవ్‌నర్ ఫౌండేషన్‌కు భారీ సాయం అందించారు. అదే విధంగా ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ చేపట్టిన 'అమ్మ పేరుతో ఒక్క చెట్టు' కార్యక్రమంలో ఆయన మొక్కలను నాటారు. సాయి సేవ సంఘ్‌కు ఎస్‌బిఐ లేడిస్ క్లబ్ నిత్యవసర సరుకులను అందించింది. దేవ్‌నర్ ఫౌండేషన్‌కు రూ.51 లక్షల విలువ చేసే ఫైర్ ఫైటింగ్ సిస్టమ్, సోలార్ ఫోటోవొల్టయిక్ సిస్టమ్‌ను సిఎస్ శెట్టి అందించారు. 2055 నాటికి శూన్య ఉద్గారాలకు చేరాలని తమ బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేవ్‌నర్ ఫౌండేషన్‌కు చెందిన సాయిబాబ గౌడ్ గొప్ప సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని శెట్టి ప్రశంసించారు. ఇలాంటి వాటికి తమ బ్యాంక్ మద్దతును అందిస్తుందన్నారు. వైద్య, విద్యా, వాతావరణ, మహిళల సాధికారతకు తమ సంస్థ ఎల్లప్పుడు మద్దతును అందిస్తుందని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్ పేర్కొన్నారు.

ICICI Home Finance
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (తూర్పు), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: గ్రౌండ్ ఫ్లోర్, 47-9-14, గంట్ల ఆర్కెడ్, 3వ లేన్, ద్వారకానగర్, విశాఖపట్నం, ఎ.పి.-530016.
[రూల్ 8(6)కు నిబంధన చూచుట] స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు
సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదైనా ఉంది" ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

| క్ర. సం | రుణగ్రహీత(లు)/సహా రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసులు. లోను ఖాతా సం. | ఏదైనా తెలిసిన రుణభారాలతో సెక్యూర్ అస్సెట్(ల) వివరాలు | మొత్తం బకాయి | రిజర్వ్‌ధర / బయానా మొత్తం | ఆస్తి తనిఖీ తేది మరియు సమయం | వేలం తేది మరియు సమయం | వేలం తేదికి ఒకరోజు ముందు | సర్ఫేసీ స్టేజ |
|---|---|---|---|---|---|---|---|---|
| (A) | (B) | (C) | (D) | (E) | (F) | (G) | (H) | (I) |
| 1. | ముదిలి నాగేంద్రబాబు (రుణగ్రహీత), పిస్సింటి భవాని (సహ రుణగ్రహీత) లోను ఖాతా సం.: LHVPM00001512149 & LHVPM00001512964 | శ్రీరామ్ భవనం, ఎస్ బ్లాక్, ఒకటవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎఫ్ఎఫ్-1, బిల్డింగ్ డో.నం.19-9-30, టి.ఎస్.నం.559 మరియు 561 భాగాలు, ఉన్న మూల్యాంకనం నం.14452, దివాన్‌జీపేట వీధి, కస్బ తూర్పు వార్డు, ఎమ్ సి వార్డు నం.19, విజయనగరం జిల్లా. | Rs. 34,30,900/- September 10, 2024 | Rs. 36,61,200/- / Rs. 3,66,120/- | October 04, 2024 11:00 AM 03:00 PM | October 10, 2024 02:00 PM 03:00 PM | October 09, 2024 before 05:00 PM | భౌతిక స్వాధీనత |

మా వేలం ఆక్షన్ ఏజెన్సీ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ వెబ్‌సైట్ (URL Link-eauction.samil.in) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 09 అక్టోబరు, 2024న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును. కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఆర్టికల్ టాప్ పై వివరించిబడిన శాఖా కార్యాలయ చిరునామా లేదా 09 అక్టోబరు, 2024న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఆర్టికల్ టాప్ పై వివరించిబడిన శాఖా కార్యాలయ చిరునామా లేదా లేదా 09 అక్టోబరు, 2024న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి విజయనగరం వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 9920807300 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరణాత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..
తేది: 22 సెప్టెంబరు, 2024, ప్రదేశం: విజయనగరం
అధీకృత అధికారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్ నంబరు- U65922MH1999PLC120106